# శబ్దాలు - శతాబ్దాలు

## (ఒక కావ్యాత్మక కథనం)

ఆ ఇంట్లో ఒక తోట- ఆ తోటలో ఒక నెమిలి
- ఆ నెమిలిలో ఒక- కాదు నా గుండెలో
ఒక యిల్లు - ఆ యింట్లో ఒక తోట - ఆ
తోటలో ఒక నెమిలి - ఆ నెమిలిలో ఒక
ఏదో ... చెపుతా - నేనెక్కడుంటే అక్కడికి
వస్తుంది ఆ నెమిలి.

నేను రాసుకుంటూనో, చదువుకుంటూనో దాన్ని గుర్తించకపోతే, నా పైజమా తన ముక్కుతో లాగుతుంది. నా కాలివేళ్ళని సున్నితంగా పొడుస్తుంది. నేను తలయెత్తి చూసేసరికి మెడజాపి మోరఎత్తి ఆ చిన్న కళ్ళతో నా వైపు చూస్తూ ఉంటుంది. పసిపిల్లవాడు తల్లి దగ్గర చేరినట్లు తినడానికి పెట్టమని గొడవ చేస్తుంది. కొక్కో-క్కో- అంటూ - ఆ పెట్టినవి జొన్నలో, బియ్యమో నేలమీద వేస్తే తినదు. కొక్కో-క్కో- అంటూ వెనక్కి- వెనక్కి- అడుగులు వేస్తూ ఉంటుంది. చేత్తో పెడితే సంతోషంగా తింటుంది. కడుపు నిండిన తర్వాత - నేను రాసుకుంటూ వుంటే అక్కడే అక్కడే వుంటుంది ఆ పరిసరాల్లోనే తిరుగుతూ అప్పుడప్పుడూ కొక్కో-క్కో- అంటూ, నేనిక్కడే ఉన్నానని జ్ఞాపకం చేస్తూ.

నేనలసిపోయి ఇంటికి రాగానే ఎక్కడ్నించో వచ్చేస్తుంది నా దగ్గరకు ఆ నడిచే రంగుల విందు, మేఘవిపినాల్లోకి ఇంద్రధనస్సు వచ్చినట్లు, పాపం మాట్లాడలేదు. తన భావం చెప్పలేదు, ఒక సముద్రం తనలో ఘోషిస్తోంది బంధాలు తెంచుకుని బయటపడ్డానికి, విఫలమై ఉద్రేకిస్తుంది. ఆ జీవి ఎంత బాధపడుతుందో లోపల సృష్టికర్తను ఎంత నిందిస్తోందో తన వైకల్యానికి.

ఒక రోజు నేను చచ్చిపోయాను. నా గదిలో అందరూ ఏడుస్తున్నారు. అదిగో నెమిలి, మెల్లగా బెదురుతూ వస్తూ వుంది. మనుషులు గుంపులుగా కూడిన ఆ గదిలోకి, నాలుగు వైపులా మొహం తిప్పుతూ, ప్రాణ భయంతో వస్తూ వుంది. ఎంత ప్రాణభయమైనా గదిలోకి ఏదో తనని లాగుతూ ఉన్నట్లుగా నా వైపు వస్తూ వుంది. ఏది లాగుతోందో నాకు తెలుసు: చాలా మందికి తెలీదు. ఇదే ఈ లోకపు దురదృష్టం! మృత్యు భయం దాన్ని నివారించలేకపోయింది. నేను చచ్చిపోయాను! కాని ఈ విచిత్రం మాత్రం చూస్తున్నాను. చాలా మంది నా దేహంమీద పడి ఏడుస్తున్నారు.

తటాల్న మొపాసా కథ ''ప్రేమ'' నా మనస్సులో మెరుపుతీగెలా మెరిసింది. ఆ కథలో వేటగాడు ఒక పక్షుల జంటలో ఆడపక్షిని తుపాకీతో కాల్చివేస్తాడు. అది నేలమీద పడుతుంది. స్నేహితుడితో అంటాడు ''తుపాకి గురి చూస్తూ కూడా రెండో పక్షి తప్పకుండా తుపాకి పరిధిలోకి వస్తుంది. ఇలాంటి జంటలో ఒక దాన్ని కొడితే రెంటినీ కొట్టినట్టే.'' అలాగే ఆకాశంలో వలయాలు చుడుతూ హృదయ విదారకంగా రోదన చేస్తూ నేలమీద రక్త ప్రవాహంలో పడివున్న ఆడపక్షివైపు వస్తూ వుంది. ఆ రెండోది భయం అన్నమాట మరిచిపోయి తుపాకి పరిధిలోకి వచ్చింది. రాగానే వేటగాడు, వేటగాడే గదా తుపాకి పేల్చాడు. మగపక్షి ఆకాశం నుంచి రాలిపడిపోయింది నేలమీద ఆడపక్షి పక్కన -

వెంటనే నాకు వినిపించింది! కఠోరంగా శపిస్తున్న పురాతన గొంతుక: నాకు తెలుసు అది వాల్మీకి ... ఆ గొంతు మొపాసా వేటగాడ్ని తిడుతూ వుంది. వాల్మీకి ఒక నిక్కరు, బూట్లు వేసుకొని ఉన్నాడు. తలమీద ఒక దొరటోపీ ఉంది; ముఖంలో నిశిత బాధారేఖలు అలుముకొని ఉన్నాయి. పక్కన స్నేహితుడి చేతిలో తుపాకి పొగలు కక్కుతూ ఉంది. నేను నా చావు సంగతి మరిచిపోయి దిగ్భ్రాంతుడ్నయ్యాను. ఈ గొంతే మునుపు ఒక వేటగాడ్ని తిట్టింది. ఇప్పుడు మరొకడ్ని తిడుతూ వుంది. ఈ గొంతు ఎప్పుడూ ఇలా తిడుతూనే ఉంటుందా అన్ని కాలాల వేటగాళ్ళని? మానవతకు గాయాలు చేసే వాళ్ళని, ద్వేషాన్ని, స్వార్థాన్ని రక్తాక్షరాల్లో రాసేవాళ్ళనీ ... కాలపు రాస్తాల్లో దాడులు జరిపే బందిపోటు దొంగల నుంచి మానవతను రక్షించడానికి అహరహమూ పహరా కాచే పోలీసా ఏమిటి ఈ గొంతు! విశ్వంలో మహనీయత శబ్దంగా మారుతుంది. ఆ శబ్దం శాశ్వతంగా లోకమంతటా పరిభ్రమిస్తూ ఉంటుంది; యుగం నుంచి యుగానికి, దేశం నుంచి దేశానికి, భాష నుంచి భాషకూ, అనంతంగా ....

ఒకనాడు 21వ శతాబ్దం సాయంకాలం నేనూ, ఆల్బర్ట్ కేమ్యూ ఒక పార్కులో స్విమ్మింగ్ పూల్లో ఈదుతున్నాము. ఆ రక్తంలో తడిసిన మేము ఒక్కసారే ఉదయించిన రెండు అరుణ బింబాల్లా ఉన్నాము. నేనన్నాను కేమ్యూ, హింసాద్వేషాల నుంచి ఏ మహాకావ్యమూ ఉద్భవించదన్నావు, మరి మనమీదుతున్న ఈ రక్తపూరమేమిటి: మనిషి మీద ప్రేమ చేతనే గదా ఈ రక్తం ప్రవహించింది? ఈ రక్తం పారకపోతే అదిగో ఆ పసిపిల్లలు అలా ఆ పువ్వుల్లో ఆడుకుంటూ ఉండే వాళ్ళు కారు. ఉదయాస్తమయాలు అందరికీ ఇన్ని రంగులు వెదజల్లేవికావు. కేమ్యూ మాట్లాడే లోపుగానే, గట్టుమీద పూచిన కుసుమ లత పక్కన కూర్చుని ఉన్న కాఫ్కా అన్నాడు, ''ఈ రక్త ప్రవాహం కావాలి, కానీ అందులో కొందరు పడవలు వేసుకుని ప్రయాణాలు చేస్తున్నారు కీర్తి శిఖరాలకు, వాళ్ళ లక్ష్యం కీర్తి శిఖరాలేగానీ ఈ రక్తం ఎవరిదో ఎవరి కోసం పారిందో వారి క్షేమం కాదు. వాళ్ళు తమ రక్తం ఒక్క బొట్టు కూడా కార్చరు. పరాయి వాళ్ళ రక్తం పారితే పాటలు రాస్తారు.''

భవభూతితో కలిసి ప్లాటో ఏదో చిత్రం పరిశీలిస్తున్నాడు. ''ఇది థాయ్‌లెండ్‌లో గీచిన హనుమంతుడి చిత్రం'' అన్నాడు భవభూతి. ''ఇది కాలాంబుధి ఈదివచ్చే మానవతా సందేశం'' అన్నాడు ప్లాటో. ఇంతలో కాఫ్కా అన్న మాటలు విని, ''ఫ్రాంజ్, ఈ పడవ ప్రయాణాల బందిపోటు దొంగలు ఎప్పుడూ వున్నారు. మా గురువుగారి చేత హాలాహలం తాగిచ్చిన వాళ్ళు వీళ్ళే. ఆయన చచ్చిన తర్వాత ఆయన మతానికి గురువులై కూర్చుందీ వీళ్ళే. చిత్తశుద్ధిలేని వాళ్ళు ఎప్పుడు లేరు? వాళ్ళలో వాడే గత సంవత్సరం సిస్టీన్ చాపెల్‌లో ఉన్న పియెటా మాతృవిగ్రహం ముక్కూ, చేతులు విరగ్గొట్టాడు. హాలాహలం తాగే ముందు మా గురువు గారు అన్న మాటలు ఇప్పటికీ ప్రతిధ్వనిస్తున్నాయి!

''ఓ న్యాయాధికారులారా! మీరు సంతోషంగా ఉండండి ... నేను వెళ్ళి పోవలసిన కాలం ఆసన్నమయినట్లు నాకు స్పష్టంగా తెలుస్తూ ఉంది. ఇక నేను మరణించడమే మంచిది; ఈ బాధ నుంచి విముక్తుడ్నవుతాను ... నాపై నేరారోపణ చేసిన వాళ్ళ మీదగానీ, నాకు శిక్ష విధించిన వాళ్ళ మీదగానీ నాకు ఏమాత్రమూ కోపం లేదు. పాపం వాళ్ళు నాకు ఏ అపకారమూ చెయ్యలేదు. ఉపకారం చేద్దామన్న తలపులేకపోవచ్చు. దానికి వాళ్ళని సున్నితంగా మందలిస్తాను.

కానీ వాళ్ళని నాకొక్క ఉపకారం చెయ్యమని కోరుతున్నాను. నా కొడుకులు పెద్ద వాళ్ళయిన తరువాత వాళ్ళను కూడా ఇలాగే శిక్షించమంటాను; నేను నిమ్మల్ని విమర్శించినట్లు, వాళ్ళ అపసవ్యపు విలువల్ని వాళ్ళ మిథ్యా స్వరూపాన్ని ఖండించండి. మీరు నిజంగా ఈ పని చేస్తే మీ చేతులతో నాకూ, నా పిల్లలకూ న్యాయభిక్ష పెట్టిన వారవుతారు.'' మా గురువు గారు తాగింది హాలాహలం కాదు! అది చిత్తశుద్ధికి నికషోపలం'' తదేక ధ్యానంగా వింటున్న ఇక్బాల్ అన్నాడు.

''కాలానికి ముందుగా పుట్టి కాలానికి బలి అయి పోయాడు, ఎన్నో అసంఖ్యాక నక్షత్రాలు హతమయిన తర్వాతనే లోకానికి ఒక అరుణోదయం కలుగుతుంది.''

500 ఏళ్ళ తర్వాత ఆయనే క్రీస్తు అనే పేరుతో పుట్టాడు. క్రీస్తుగా పుట్టడానికి 100 ఏళ్ళ ముందు మహాకవి వర్జిల్ మనస్సులో మెరుపు తీగెలా మెరిశాడు. ఆ మహాకవి తన ఎకొలోగ్స్‌లో ''ఆ దివ్యజ్ఞాన గీతంతో చరమ ఘట్టం ఇప్పుడు వస్తుంది. మహాశకాల పరంపర మళ్ళీ పుడుతుంది ఆ కన్య మళ్ళీ తిరిగి వస్తుంది. ఇప్పుడు ఒక కొత్త జాతి సువర్లోకం నుంచి భువర్లోకానికి అవతరిస్తుంది. ఓ నిర్మల దేవతా, ల్యూసీనా, ఈ కొత్తగా పుట్టిన శిశువు మీద నీ కరుణామయ మందహాసాలు చిలకరించు, ఈ శిశువు కాలంలో ఇనుపజాతి అంతరిస్తుంది, సువర్ణ జాతి ఉదయిస్తుంది, ప్రపంచమంతటా వ్యాపిస్తుంది ...'' అని గానం చేశాడు. కనుకనే ఆయన్ని ఈనాడు క్రీస్తుకు పూర్వమే పుట్టిన క్రిస్టియన్ అంటారు.

ఒకనాడు టెలివిజన్‌లో మెడ్ డయార్మిడ్ ముఖం - ఆయన తన ''థర్డ్ హిమ్న్ టు లెనిన్'' పాడుతున్నాడు.

''మైకేల్ రాబర్ట్స్, ఇంకా ఇతర దేవదూతలూ, ఓ డెన్, స్పెండర్ ... వీరెవరికీ కార్లయిల్‌కున్న ధైర్యంలో, నీతిలో పదో భాగం లేదు. ఆ వంచకుల్లా కాక నేను శ్రామిక వర్గంలో వాణ్ని: శ్రామికుల కోసం కృషి చేస్తున్నానని గొప్పలు చెప్పుకునే వాళ్ళలో ఒకడ్ని కాదు, శ్రామికుడ్నే ...''

నేనన్నాను ''బాబూ చాలా చక్కగా చెప్పావు బాగుంది, ఒక చిన్న సంఘటన చెపుతాను - మొన్న ''19వ శతాబ్దపు ఫ్రెంచి కవిత'' అనేది నాదో పుస్తకం పుస్తకాల అలమారులోంచి అదృశ్యమయింది. ఎవడో చెప్పకుండా పట్టుకు పోయాడే దొంగ వెధవ అని కొన్నాళ్ళు వాపోయాను. కానీ ఒకనాడు అది కనిపించింది. ఒక ఆధునిక కుకవి వచన కవితలో!''

''ఎవడండీ వాడు, మీ తెలుగు వాడేనా ఏమిటి?'' అన్నాడు పూర్‌మెక్ డయార్మిడ్ -

రాత్రి వచ్చిందో కల, టెక్నికల - అంతరంగంలో మల్టీ డైమన్షన్ తెర మీద దృశ్యాలు. ష్లై కోక్తో నేనూ కూర్చుని నల్లమందు పొగతాగుతున్నాము.

''వృక్షజాతి పదార్థాల్లో నల్లమందొకటే మనకు వృక్షస్థితిని సిద్ధింపజేస్తుంది. దాని మూలంగానే వృక్ష జాలంలో ఉన్న ఒక అవ్యక్తమైన వేగం మనకు తెలుస్తుంది. మామూలుగా నిశ్చలంగా కనిపిస్తాయి. కానీ వాటికున్న వేగం మన అసమర్థ ఇంద్రియాలు అనుమానించను కూడా లేవు'' అన్నాడు కోక్తో. పక్కనే పికాసో ఉన్నాడు ''నల్లమందు వాసనా ప్రపంచంలో, చాలా తక్కువ అసహ్యత ఉన్న వాసన. ఆ వాసనతో పోల్చతగింది సర్కసు వాసన గానీ లేక ఓడరేవు వాసనగానీ'' కోక్తో ''ఆ వాసన ఎంత ఇంద్రజాలం అల్లుతుందో చెప్పలేను ఈగలు నాలుగు దిక్కుల్నించీ వచ్చి ముసురుకుంటాయి,, వాటి తలల్లో స్వప్నాలు ముసురుకుంటాయి. బల్లులు గోడల కంటుకుని మూర్ఛపోతాయి. రాత్రి రాకకోసం నిరీక్షిస్తాయి.''

నేనన్నాను ''నల్లమందు మా ఖండం నించి మీరు తెచ్చుకున్నారు కానీ దాని మర్మం మీకు తెలిసినంతగా మాకు తెలీదు'' కోక్తో అన్నాడు. ''యువ ఏషియా దాని పొగ ఇప్పుడు తాగదు ఎందుచేతనంటే వాళ్ళ తాతయ్య తాగేడు కనుక! దురదృష్టం ఏమిటంటే యువ ఏషియా, యువ యూరోపును అనుకరిస్తూ ఉంది. కనుక నల్లమందు మా ద్వారానే తన జన్మస్థానం చేరుకుంటుంది.''

ఇలా సంభాషణ సంచరిస్తూ ఉంటే నా మనస్సు కర్పూర పరాగంలా




గాలిలో కలిసిపోతూ ఉంది. ఇలా ఉందేమిటి అన్నాను. కోక్తో - ''మేలుకోవడానికి ప్రయత్నించకు. దాని మృదులాంగులను ఉపలాలనకు లొంగు. ఒక్కసారి మేలుకున్నాడంటే వాడు వట్టి చవట - అంటే మేధావి అన్నమాట. నేనెక్కడున్నాను అంటాడు మూర్ఛపోయి తేరుకున్న ఆడదానిలా మేలుకొని ఉన్న కవిరాసే రాతలు చదవడం నిష్ప్రయోజనం.''

నేనన్నాను ''మరి కలల్లో తల మునిగిన కవిరాసే రాతలు ఎవరికర్థమవుతాయి.''


''రాజకీయ వాది అయితే తప్ప కవి అయిన వాడు తనని అర్థం చేసుకునే పాఠకుల సంఖ్య పెంచే ఆధారపడాలి తన భాష, గొంతుక పోల్చుకోగల్గిన వాళ్ళు, తన భాష లంతరాత్మను పసిగట్టగలిగిన వాళ్ళు తన

పాఠకులు. ఎక్కువ మంది పాఠకుల కోసం ఆశించడం కవి లక్షణం కాదు'' అన్నాడు కోక్తో.

ఇలియట్ అందుకుని ''నేను నీతో ఏకీభవిస్తాను. రాజకీయ సంబంధం కవిత్వానికి తక్షణం గుర్తింపు తీసుకు రాగలదో గానీ రేపు కూడా ఆ కవిత్వం చదివారంటే ఆ రాజకీయ సంబంధం ఉందని కాదు - లేక పోయినా చదువుతారు, అది నిజంగా కవిత్వమయితే, ఎంచేతనంటే రాజకీయ పదార్థం కూడా మానవీకరింపబడి కవితగా మారకపోతే అది చదివి మరిచిపోవడానికి మాత్రమే అర్థమవుతుంది'' అన్నాడు.

''సరే ఇలియట్, నీవు ఇడియట్ అవుతేగానీ కవిత్వం చెప్పలేవు. నల్లమందు పొగతాగితే నీవు నీలో ఉండవు. నీ బాహువుల్లో నీ తల దాచుకో, భుజానికి చెవి జోడించు; ఇక చూడు - భూకంపాలు, విప్లవాలు, కర్మాగారాలు పేలిపోవడం, సైన్యాలు సైన్యాలే పారిపోవడం, మహాప్రవాహాలు ముందుకు దూకడం - ఎన్నో చిత్రాలు నీ శరీరాంతర్గత సీమల్లో నక్షత్రాలు కిక్కిరిసిన రాత్రిలో నీ చెవి దర్శిస్తుంది!''

అప్పటికే నాలో కాలమూ, దూరమూ అంతర్థానమయ్యాయి. శబ్దాలు సముద్రాలు వాటి సంగీతం విజృంభిస్తున్నాయి. ఆ అవ్యక్త మానసిక సముద్ర తరంగాల్లోత 'మచ్చూ పిచ్చూ'' పద్యం పట్టుకుని పాబ్లో నెరూడా ఉదయించాడు. ''ఉదయించు తమ్ముడా నాతో మరోసారి ఉదయించు'' అని కేకేశాడు. మరొకసారి కెరటాల మీద పాదఘట్టన చేస్తూ ''నీవు ఇక్కడ పాతిపెట్టిన ఆ బానిసను తీసుకోనీ, దళిత జీవుల రొట్టెను ఈ భూమినించి లాగివేసుకోనీ'' అని ఆక్రోశించాడు.



నల్లమందు పొగ నా గదినిండా కమ్ముకుంది. గోడల మీద బిల్లులు, ఈగలు, దోమలు కలల అలల్లో తేలిపోతున్నాయి. పసుపు వన్నె కలలు ముసురుకుంటున్నాయి. గౌరవర్ణ జాతుల కంఠాలు వినిపిస్తున్నాయి. ఇషి కవాటకు తన లోతైన జపానీ గొంతుతో గానం చేస్తున్నాడు. ''నేనొక దుఃఖ భాజనుడ్ని, నేను బలహీనుడ్ని కానీ నా చేతిలో ఒక అద్వితీయమైన భయంకర ఖడ్గం ఉంది. నేను యుద్ధం చేయకపోతే దాన్ని నేను సహించలేను. కానీ నేను జయించలేకపోతున్నాను. అంటే ఇక మరణమే నాకు శరణమన్న మాట. కానీ నాకు చావంటే పరమ రోత. నాకు చావడం ఇష్టం లేదు. మరి బ్రతకడం ఎలా?''

ఏ ప్రేమ మానవతకు రూపాంతరమో, చిత్తశుద్ధికీ, నీతికి, ధైర్యానికి మారు పేరో, ఏ ప్రేమ ఇద్దరు పరస్పర అజ్ఞాత వ్యక్తుల్ని విలీనం చేసి సృష్టి అనంతతను ఆవిష్కరిస్తుందో, ఏ ప్రేమ సర్వమానవ జాతినీ ఒక్క చరిత్ర మూసలో వేసి మానవతా హిరణ్యంగా మలిచివేస్తుందో, ఏ ప్రేమ చేత మనిషి అన్యాయం మీద, దౌర్జన్యం మీద తన ఇనప పిడికిలి ఝుళిపిస్తాడో, ఏ ప్రేమ వల్ల మనిషి న్యాయాన్ని నిరోధించే శక్తుల్ని తన పవిత్ర కర్కశ పరశువుకి బలిచేస్తాడో, గాయపడ్డ మానవతకి రక్తంతో తర్పణం చేస్తాడో, ఆ యుగయుగాల శిక్షా ఫలితంగా మానవుడు సాధించి రక్తకణాల్లో నిక్షిప్తం చేసుకున్న సంపదను కాలితో తన్నేవాళ్ళు దేశంలో కవులుగా నేతలుగా పెరుగుతున్న ఈ రోజుల్లో మానవ రక్తాన్ని, స్వేదాన్ని మకుటాలుగా చేసుకుని మస్తకాల మీద అలంకరించుకుంటున్న ఈ రోజుల్లో -

ఆకాశాలు తగిలే శిఖరాలు, విమలవాయువులు విహరించే ఆకాశాలు, పూలభాషలు మాట్లాడే అమాయక వాయువులు, కిరాతకుల మీద జ్వలించే రంగులు ఉమిసే పువ్వులు, మానవతతో దోబూచులాడే రంగులు, కాంతీ కమనీయత మనిషి మనిషికీ పంచిపెట్టాలని ఆక్రోశించే మానవత - ఇవన్నీ ఎవరి మనసులో తిరునాళ్ళు చేసుకుంటున్నాయో, వాడు చచ్చిపోవడమే మేలు. నేను చచ్చిపోవడం మంచిదే అయ్యింది. చచ్చిపోతే ఈ నీచుల తమాషా చూస్తూ ఉండవచ్చు - నాకేం కావాలి; నా పాటల్ని పూలు పక్షులు గానం చేస్తున్నాయి, నదులు, సముద్రాలూ ఘోషిస్తున్నాయి, సంధ్యలు ప్రతిఫలిస్తున్నాయి. ధ్వనులు, జనులు జీవనాడులతో మేళవిస్తున్నారు. కనుక కాగితానికి కలానికి ఇక గుడ్ బై -

## శబ్దాలు - శతాబ్దాలు

చచ్చిపోయిన వాడికి బ్రతికున్న వాడికి కనిపించనివి కూడా కనిపిస్తాయి. శబ్దాలు కనిపిస్తాయి - శతాబ్దాలు కనిపిస్తాయి. వినిపించే సంగీతాలు కనిపిస్తాయి - కనిపించే రంగులు వినిపిస్తాయి - కళ్ళ పని చెవులు, చెవుల పని కళ్ళు, కాళ్ళ పని చేతులు, చేతుల పని కాళ్ళు ఇలా శరీరంలో ఒక దాని పని మరొకటి చేస్తే చావు సారాంశం బ్రతుకులో తెలుసుకోవచ్చు. బ్రతుకు సారాంశం చావులో తెలుసుకోవచ్చు. ఇదీ ఇప్పుడు నేననుభవిస్తున్న అసూయాజనకమైన అవస్థ.

ఫ్లా కోక్తో ఈ అవస్థనే నల్లమందు ధూమపానంతో సిద్ధింప జేసుకోవాలనుకున్నాడు. ఆయన అంటాడు ''అయిదుగుక్కలు పీలిస్తే చాలు, మనసులో భావం తలకిందులవుతుంది. ఒక నల్లటి ఈతగాడిలా హ్రస్వరూపం ధరించి, చైనీస్ సిరాలా ఉత్కృష్ట వాంఛలు రేపుతూ దాహంలోని సరోవర్ జలాలంతటా మందమందంగా వ్యాపిస్తుంది; నల్లమందు అమూర్తమయిన వస్తువుకు మూర్తినిస్తుంది. ఊహను పదార్థంగా మార్చి పరిమాణం ఇస్తుంది.'' ''మనకు కనుపించని వాటికి మనం కనిపించేలా చేస్తుంది! మనల్ని భూతాలను చేసి మనకు కనిపించకుండా తిరిగే భూతాలకు భయం కలిగిస్తుంది. ఆ పొగ పీల్చిన తరువాత దేహం ఆలోచిస్తుంది. మెదడు కాదు దేహం కలలుకంటుంది; మృదులమవుతుంది, శకలాలవుతుంది, ఎగురుతుంది, ఎగిరిపోయి తనని తానే ఆకాశం నించి పక్షిలా చూచుకుంటుంది.''

ఏప్రిల్ మాసం వచ్చింది తోటలో వనజ్వాల ఎర్రగా విరగబూచింది, అప్పుడే వచ్చిన శ్రీశ్రీ ఉత్తరం చదువుతున్నాను. నవుకరు కాఫీ తెచ్చాడు. నాకూ, పక్కనే ఏదో చదువుకుంటున్న రేంబోకూ, ఇచ్చాడు. నేను కొంచెం చప్పరించి ''ఏమిటి పౌడర్ పాలు వేశావా?'' అన్నాను.

''అవునండి, హైదరాబాద్‌లో 10 గంటల లోపుగా గేదెలు కూడా నిద్రలేవవు'' అన్నాడు నవ్వుతూ.

రేంబో నవ్వి ''శ్రీశ్రీ ఏం రాశాడు?''

ఒక లైను వినిపించాను - ''మీ కవితలో మీరొక వరుసవేది కోసం వెతుకులాడుతున్న అన్వేషిగా కనిపిస్తున్నారు నాకు ...''

''మీ శ్రీశ్రీ గారికి ఆల్కెమీ తెలుసా ఏమిటి'' అన్నాడు రేంబో -

''ఏమో''

నేను బెల్జియం, స్కాండినేవియా, ఇటలీ, సైప్రస్, అబిసీనియా ఇలా దేశదేశాలు తిరిగాను. మీరు స్వర్ణ విద్య అనే ఆల్కెమీకోసం.''

''వేమన పద్యాల్లోలా మీ పద్యాల్లో కూడా అందుకేనేమో కొన్ని శబ్దాలు, భావాలు అర్థం కావు.'' రేంబో చిరునవ్వు నవ్వి ఏ పద్యం గురించి అంటున్నారు. ''ఎన్‌ఫాన్సే''నా మీ మనసులో ఉంది? అన్నాడు. ''ఔను మరి'' ''సోనె బెవోయెల్స్'లో కూడా అలాగే అర్థం కానివి ఉన్నాయి'' అన్నాను. ''అది తంత్రాలకు సంబంధించిన వ్యవహారం; ప్రతి రంగుకూ ఒక శబ్దం ఉంది, ప్రతి శబ్దానికీ ఒక నిర్దిష్టమైన రంగు ఉంది.''

''నిజంగా?'' ఔను నాకలా కనిపిస్తాయి, వినిపిస్తాయి'' అన్నాడు రేంబో గంభీరంగా - నేను కాఫీ తాగుతున్న వాడ్ని నిలువునా నిర్వీణ్ణుడ్నయి పోయాను. ఒక నిమిషం ఊరుకుండి. ''వేమన్నను కలుద్దామా'' అన్నాను. రేంబో ''నిజంగా నాకు చాలా ఇష్టం'' అన్నాడు.

''ఎక్కడ ఆయన ఆశ్రమం?''

''ఎక్కడని చెప్పేది'' అదొక విచిత్రమైన మనస్సు. అన్ని చెట్లు, అన్ని అడవులు, అన్ని ఊళ్ళు, అన్నీ ఆయన ఆశ్రమాలే''.

''మరి ఎక్కడికని వెళ్ళాలి మనం.''

''ఏమో - అలా వెడుతూండటమే. మీరు సిద్ధమయితే ఈ సాహస యాత్ర సాగిద్దాం.'' సరే అని ఇద్దరం కాఫీలు ముగించాం. ప్రవేశించాం, విశాల విశ్వంలోకి; ఊళ్ళు, అడవులు, పొలాలు, నదులు, నగరాలు, గడుస్తూ, నడుస్తూ వెళ్ళగా వెళ్ళగా ఒక ఊళ్ళో, ఒక వీధిలో ఒక చెట్టు కింద ఒక కాలుజాపి, ఒక కాలు మడిచి, మడిచిన కాలు మీద గడ్డం పెట్టి, దృష్టి నేలమీద నిలిపి, కూర్చొని ఉన్న ఒకాయన అల్లంత దూరాన కని పించాడు. రేంబోకు చెప్పాను. ఈయనే వేమన అని. సమీపించాం -

గోచి తప్ప ఏమీ లేదు ఒంటి మీద. మేము దగ్గర ఉన్నా ఆయన ఎలా కూర్చున్నాడో అలాగే ఉన్నాడు. కదలలేదు, మెదలలేదు, మా వంక చూడ లేదు. ఒక చిరునవ్వు మాత్రం ఆ వంగిన మొహం కనిపించిపోయింది. ఏదో చిన్న కర్రపుల్లతో నేలమీద రాస్తున్నాడు. రేంబో అన్నాడు ''మీకు పరుసవేది సిద్ధించిందా?'' - వేమన అలాగే పూర్వంలా కూర్చున్నాడు. ఆ నేల మీద రాసింది చదివాము. ''హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ రజత స్రజాం'' అని రాసిన అక్షరాలు కనిపించాయి. ''మనం అడగబోయేది ముందే రాశాడు. ఎలా గ్రహించాడు మన మనస్సులో ఉన్నది'' అని రేంబో ఆశ్చర్యంగా అడిగాడు.

''నీ ఊహ భూతభవిష్యద్వర్తమానాల్లోనూ ఉంటుంది. నీవిప్పుడు ఊహించి ఇప్పుడే ఊహించాననుకోవడం అజ్ఞానం. ఊహ అమూర్తము. అమూర్త వస్తువు కొందరికి కనిపిస్తుంది'' అన్నాను నేను, నా కావిషయా లేమిటో తెలీకుండానే.

అంటే మరొకరెవరో నా శరీరాన్ని ఉపయోగించుకుని నా నాలుకతో మాట్లాడుతున్నట్లు. మేము వెనక్కి తిరిగి వచ్చేశాం. 'నాకు స్వర్ణం కాదు కావలసింది స్వర్ణం కంటే విలువైన శక్తి పువ్వుల భాషలు, నక్షత్రాల పాటలు వినగలగాలి. సంధ్యాకాశంతో సంభాషించాలి, నీలాకాశం కింద తుకతుక లాడే సముద్రపు గుండె చూడాలి. శతాబ్దాల గుండెల నించి దూసుకు పోయే మానవతా వేగాన్ని త్రికాలాల్లో దర్శించాలి, శబ్దాలు చూడాలి, రంగులు వినాలి, దేశ కాలాతీతమైన అనందాన్ని భూమధ్య రేఖలో ధరిం చాలి, ద్రష్ట కావాలి అన్నాను - ''అవును నేనూ దానికోసమే అన్వేషిస్తు న్నాను, మళ్ళీ వెడదామా''. ''ఇప్పుడెక్కడుంటాడో ... దొరుకుతాడో దొరకడో ...''

సూర్యుడు ఉదయించాడు. కాల దూరాలతో వలలల్లి జగజ్జనుల మీద విసిరివేస్తున్నాడు. మళ్ళీ తోట - వనజ్యాల - కాఫీ - రేంబో - ఇవాళ శేషేంద్ర అంతర్ముఖుడై ఉన్నాడు. చూపులు మాత్రం విరగబూచిన వనజ్యాల పూలమీద పరుగులిడుతున్నాయి.

''ఏమిటా మౌనముద్ర'' అన్నాడు రేంబో అంతే - శేషేన్ ఏదో ఒక గ్రీక్ ఆరెకిల్‌లా మాట్లాడసాగాడు. ''కవి అన్నవాడు ద్రష్ట కావాలి ఎలా అవుతాడు. అన్ని పాపాలూ చేయాలి, ఎంతో మనోబలం కావాలి తన మీద తానే ఇంత హింస విధించుకోవాలంటే. అప్పుడు వాడొక ఘోరమైన నేరస్థుడవుతాడు, కిరాతకుడౌతాడు, ఋషి అవుతాడు! ఎందుచేతనంటే వాడు అవ్యక్తాన్ని చేరాడు. సామాన్య మానవులు సుఖలాలసులై ఉన్న చోటనే ఉండిపోగా, వీడు మాత్రం బాధాగ్నుల్లో దూకి ఒక నూతన సువర్ణంగా బయటికి వచ్చాడు. నాకు సువర్ణం దొరకడం చాలదు, నేనే సువర్ణం కావాలి'' రేంబోనన్నావహించాడు.

వనజ్యాల నుంచి ఒక పువ్వు రాలింది. దాంట్లోంచి దిగి భోజుడు వచ్చాడు. మేము అభ్యుత్థానం చేసి ఆయన్ని కూర్చోబెట్టాము. ఆయన అన్నాడు ''అలా పువ్వు మీద ఎక్కి వెడుతూ మీ సంభాషణ విని వచ్చాను. విన్నారా వాల్మీకి మొదట ఎన్నో పాపాలు చేశాడు, బాధలు అనుభవించాడు. కిరాతకుడయ్యాడు, అవ్యక్తాన్ని వ్యక్తం చేసుకున్నాడు. అనుభవంతో ఒక అందని బిందువునందుకున్నాడు. అక్కడ ఆయన కిరాతకుడూ, కిరాత కుడ్ని శపించేవాడు వేటగాడు వేటాడబడే వాడూ.

ఇత్థం విలప్య విపినే దయితాం విచిన్వన్ రామో న తత్ర ధృతిమాన్ నహి లక్ష్మణోఽశ్రుతా దృ గ్విధామసి కథాం కథయన్ స్వవాచా వల్మీక జన్మ మునిరేవ కఠోర చేతాః

రేంబో ఇంకా చాలా ఆలోచనా పూరితుడయ్యాడు. ''బోదిలేర్ మహాకవి, ప్రథమ ద్రష్ట రాజులకు రాజు, నిజమైన దేవుడు'' అన్నాడు.

నేనన్నాను ''రేంబో అటు చూడు - ఆ సూర్యోదయం, అదే సూర్యాస్తమయం అవుతుంది మరో తీరానికి. ఈ తీరాలు, ఈ సంధ్యలు, ఇంద్రియాల ఇంద్రజాలం, ఈ ఇంద్రజాలం వల నుంచి తప్పించుకున్న వాడికి వాల్మీకే బోదిలేర్, బోదిలేరే వాల్మీకి. ద్రష్ట ఒక్కడే - త్రికాలా బాధ్యుడు''

నేను లేచాను, రేంబో భుజంమీద సాయంగా చేయివేసి ముందుకు నడుస్తున్నాను. ఏదో భారం నన్ను ముంచుకు వస్తూ ఉంది. నా లాల్చీ అంతా చెమటతో తడిసిపోయింది. భుజంమీద శాలువా జారిపోయింది. అలా వెడుతూ ఉన్నాను. అలా వెడుతూ ఉన్నాను వనజ్యాల వైపు: రేంబోకు అర్థంకాక అలాగే నిర్విణ్ణుడై నిలబడిపోయాడు. వెనక గుంపులు గుంపులుగా వస్తున్నారు భవభూతి, కోక్తో, లియోనార్డో, నెరూడా, మైకెలేంజిలో, బోదిలేర్, మల్లార్మే, కాళిదాసు, ఇలియట్, పౌండ్ శాంటాయనా, భాసుడు, గాలిబ్, కృష్ణరాయలు, సౌదా, మీర్, ఎర్రన, శ్రీనాధుడు. లోర్కా, ఇక్బాల్ రోడే, రిల్కే, వర్జిత్, పికాసో, సోక్రటీస్, జీసస్ కవబాటా, కవాఫీ, సెఫరిస్ ఎవరెవరో ఎందరో అలలు అలలుగా తలలు తలలుగా పరం పరలుగా, రేఖలుగా, కాంతులు ముసురుకున్నట్లుగా గుంపులు గుంపులుగా వస్తున్నారు.



నేను ముందున్న వనజ్యాల వైపు వెళుతున్నాను. వనజ్యాల నన్ను అడ్డగించలేదు: అందులోకే వెళ్ళి పోయాను. నన్ను తనలోకి తీసుకుంది. నేను లేదు. వనజ్యాల వుంది.

వెనక వస్తున్న గుంపులు, ఆ తలల పరంపరలు, నా వెనకాలే వనజ్యాల వైపు క్రమక్రమంగా వచ్చి పువ్వు పువ్వులోనూ లీనమై పోయాయి. మిగిలింది ఎర్రగా విరగబూచిన వనజ్యాల -

ఎప్పటిలాగే ఏప్రిల్ మాసం -

మిలియన్ల పూలు గొంతులు విప్పి కాకలీ కంఠాలతో పాడుతున్నాయి.

''రండి, మా గుమ్మానికి తోరణాలు కండి మానవ జీవితాన్ని ఒక మహోత్సవం చేయండి.''

''పిడికెడు వసంతాలు అందరికీ భిక్షపెట్టమంటావు. నీకు మాత్రం ప్రేమించే రెండు పెదవులు చాలునంటావు.

''పొండి<br>
రేపటి గులాబీల తోటల్లో<br>
ఉషస్సులై పొండి<br>
ఉషస్సులైపొండి''

**- గుంటూరు శేషేంద్రశర్మ**